క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వంగవీడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

మధిర: మండలంలోని వంగవీడు గ్రామంలో పలు అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సోమవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు, రూ.5 లక్షలతో ఎస్సీ శ్మశానవాటికకు ప్రహరీ, స్నానపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కమలరాజ్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, పంచాయతీలకే నిధులను మంజూరు చేస్తూ అభివృద్ధికి పాటు పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట్‌లాల్

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలు వ్యాధులతో బాధపడుతున్న 69 మంది రోగులకు డాక్టర్ వెంకట్‌లాల్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు ఆయుర్వేద వైద్య సేవలు అందిస్తామన్నారు. రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, ఫార్మాసిస్టు శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్స్ వెంకటేశ్వరరెడ్డి, సాయిరెడ్డి, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించాలి



నాగిలిగొండలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సురేష్

చింతకాని: ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు వంద రోజులు పని కల్పించాలని గ్రామ సర్పంచ్ చాట్ల సురేష్ తెలిపారు. మండలంలోని నాగిలిగొండ గ్రామంలో జరుగుతున్న పంట కాలువ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశంలో టెంట్ ఏర్పాటు చేయాలని, తాగు నీటి సౌకర్యాన్ని కల్పించాలని సూచించారు. పని చేసిన కూలీలకు వెంటనే వేతనాలు వారి ఖాతాల్లో జమ అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలో గత రెండు రోజులుగా జరుగుతున్న గ్రామదేవతల ప్రతిష్ఠ వేడుకలు సోమవారంతో ముగిసాయి. రెండు రోజులు నుంచి హోమ గుండం పూజలు, మహిళలు బోనాలు ఎత్తుకొని గ్రామంలో ఊరేగింపుతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజులో భాగంగా కట్టమైసమ్మ, పోతురాజు, గంగమ్మతల్లి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తుళ్లూరి ప్రసాద్‌కు నివాళి

సత్తుపల్లి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుళ్లూరి ప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం తుళ్లూరి ప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా డాక్టర్ మట్టా దయానంద్ కూడా పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో చలసాని సాంబశివరావు, చల్లగుళ్ల నర్సింహారావు, హరీష్, పుసులూరి హనుమంతు, వినుకొండ కృష్ణ పాల్గొన్నారు.


మండలంలో తుమ్మల పర్యటన..

వైరారూరల్: వైరా మండలంలో వానాకాలం సాగుపై మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరా తీశారు. సోమవారం స్టేజీ పినపాక, పూసలపాడు గ్రామాల్లో తుమ్మల పర్యటించారు. స్టేజీ పినపాకలోని నాయకుడు శ్రీరామనేని విజయభాస్కర్ ఇంటి వద్ద ఆగారు. అక్కడ తనను కలిసిన రైతులు, నాయకులతో కొద్దిసేపు తమ్మల ముచ్చటించారు. ఆ తర్వాత పూసలపాడులో చుక్కపల్లి వెంకటేశ్వరరావు దశదినకర్మలో పాల్గొని చుక్కపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మట్టికుండకు ఆదరణేది?

- పేదోడి ఫ్రిడ్జ్‌కు తగ్గిన డిమాండ్
- అంతంత మాత్రంగా విక్రయాలు

రోజురోజుకు ఎండలు మండుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి రాగానే తక్షణమే కూలింగ్ ఇచ్చే ఫ్రిజ్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మట్టి కుండలను మట్టి సీసాలకు ఆదరణ తగ్గుతుంది. కాలానుగుణంగా మట్టి కుండలు వాడకం తగ్గించారు. ఒకప్పుడు మట్టి పాత్రలతో మన జీవితాలు మమేకమై ఉండేవి. ప్రస్తుత కాలంలో మారిన జీవనశైలితో స్టీల్, ప్లాస్టిక్, పింగాణి పాత్రలు వచ్చేశాయి. రిఫ్రిజిరేటర్‌లోని చల్లని నీరు తాగడం వల్ల ఆకస్మాత్తుగా గొంతు కణాల ఉష్ణోగ్రత పడిపోతుంది. గొంతు నొప్పితో పాటు, జలుబు చేసే అవకాశం ఉంది.



మట్టికుండలు విక్రయిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: ఎండాకాలంలో మట్టికుండలో నీళ్ల తాగితే చల్లదనానికి చల్లదనం.. ఆరోగ్యానికి ఆరోగ్యం.. అందుకే ఇప్పటికీ చాలామంది వీటిని చలివేంద్రాలకు, పలు కుటుంబాలలో వినియోగిస్తూ ఉంటారు. ఈ ఏడాది మట్టి కుండల కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ప్రస్తుతం కొందరు పాతతరంగా ఆలోచిస్తూ.. శుభకార్యాలకు ఎక్కువగా మట్టి పాత్రల్లో తోడేసిన పెరుగునే వాడేందుకు మొగ్గు చూపుతున్నారు.

మట్టి కుండలతో ఆరోగ్యం..

వినియోగదారులను ఆకర్షించడానికి అదంగా తీర్చిదిద్దిన మట్టికుండలు, రంజన్లను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. వీటిలోని నీళ్ల తాగితే ఎన్నో లాభాలున్నాయి. కుండనీటిలో సహజమైన మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ ఉంటాయి. మలినాలను పీల్చుకొని నీటిని చల్లగా మార్చే అద్భుత శక్తి మట్టికుండకు మాత్రమే ఉన్నది. ఎండలో నుంచి వచ్చి కుండలో నీటితో ముఖం కడుక్కుంటే ఆహ్లాదంతోపాటు వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చు. రోగ నిరోధక శక్తి మెరుగుపడి జీవనక్రియలను పెంచుతుంది. శరీర శక్తి లభిస్తుంది. దగ్గు ఆస్తమా, ఇతర శ్వాసకోశ వ్యాధులు దరిచేరవు.

మట్టి పాత్రల్లో వంట చేయటం వల్ల..

మట్టి పాత్రల్లో వంట చేయటం వల్ల లాభాలు ఉన్నాయి. మట్టి కుండలు వేడినీ, తేమనీ సమానంగా మన ఆహారానికి అందజేస్తాయి. వీటిలో వండిన ఆహారంలో పోషకాలు పోకుండా అలాగే ఉంటాయి. మట్టి కుండలలో వండిన మాంసాహారం చాలా మృదువుగా ఉంటుంది. మట్టి కుండల్లో ఉండే ఆహారంలో నూనె శాతం చాలా తక్కువ అవసరం ఉంటుంది. మన పూర్వీకులు ఈ ఆహారాన్ని చాలా బలమైన ఆహారంగా చెబుతారు. మట్టికుండల్లో పెరుగు కూడా చాలా చిక్కగా మంచి రుచిగా ఉంటుంది. రంధ్రాలున్న మట్టికుండల్లో ఆహారాన్ని వండటం వల్ల ఉష్ణోగ్రత, ఆవిరి అన్ని వైపులా వెళ్లి ఆహారం చాలా రుచికరంగా మారుతుంది. ఈ పాత్రలను శుభ్రపరచాలంటే వీటిని ఒకటి వేడి నీరు, మరొకటి గోధుమ పిండితో మట్టి పాత్రలను శుభ్రం చేసిన తర్వాత ఉపయోగిస్తే వంట చేయడానికి సిద్ధమైనట్టే.

ధరలు ఇలా..

నాలుగు లీటర్ల నీళ్ల పట్టే కుండ ధర రూ.80లు, 15 లీటర్ల కుండ రూ.150, 20 లీటర్ల కుండ రూ.200 నుంచి రూ.300 వరకు ఉన్నాయి. కుజా రూ.100, అన్నం, కూరలు వండే పాత్రలు వాటి సైజులను బట్టి రూ.250 నుంచి రూ.500 వరకు ఉన్నాయి.

అమ్మకాలు అంతంతమాత్రమే..



వాతావరణ పరిస్థితుల్లో మార్పులు రావటంతో ఈ ఏడాది కుండల అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అదే విధంగా కుజాలు, పెరుగు తోడేసేందుకు పాత్రలు, మట్టి పాత్రల్లో కూరలు, అన్నం వండుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ధరలు పెరగటం వల్లే ఈ ఏడాది అమ్మకాలు తగ్గాయి.

– బయ్యా అప్పారావు, వ్యాపారి, సత్తుపల్లి

వంటలు చేసేందుకు..



మట్టి పాత్రల్లో కూరలు, అన్నం వండుకుంటే ఆరోగ్యానికి మంచిదని మట్టి పాత్రలు కొనుగోలు చేస్తుంటా. ఫ్రీజ్‌లో తాగే నీటి కంటే కుండల్లో పోసిన నీరే ఆరోగ్యానికి మంచిది. వీటి ధరలు చూస్తే సామాన్యులకు భారంగా ఉన్నాయి. వంటలు వండే పాత్రలు రూ.250 నుంచి మొదలు కొని ఉన్నాయి.

– కురిశెట్టి రాధ, సత్తుపల్లి

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. స్థానిక శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో సోమవారం నియోజకవర్గస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పదేళ్ల అభివృద్ధిని ప్రతి ఒక్కరికి తెలియ చేస్తూ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. జూన్ 2వ తేదీ కల్లా అన్ని ప్రభుత్వ శాఖలు నియోజకవర్గంలో 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ ఉత్సవాలు జరిగే రోజుల్లో ఫంక్షన్లను త్యాగం చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఈఈలు హేమలత, నళిమోహన్, ఏసీపీ రామానుజం, విద్యుత్‌శాఖ డీఈఈ రాములు, కమిషనర్ సుజాత, డాక్టర్ ప్రదీప్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ టి.సీతారాం, సింగరేణి పీఓలు వెంకటాచారి, నర్సింహారావు, ఫైర్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ దొడ్డా హైమావతి, ఎఫ్‌డీఓ మంజుల, కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈఓ బి.రాములు, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

బోనకల్: తెలంగాణా దశాబ్ది ఉత్సవాలను షెడ్యూల్డ్ ప్రకారం నిర్వహించాలని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణకై అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామపంచాయతీలలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను నిర్వహించాలని సూచించారు. అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులకు సంబంధించి నేమ్ బోర్డులను పెట్టాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఏపీఎం పద్మలత, వైద్యాధికారి స్రవంతి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలే గుణపాఠం చెబుతారు



కల్లూరులో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

కల్లూరు: ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్న పాలక ప్రభుత్వాలకు ప్రజలే గుణపాఠం చెబుతారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంభాని చంద్రశేఖర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంలో కల్లూరు పట్టణంలోని శాంతినగర్ నుంచి కప్పలబంధం రోడ్డు వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంభాని మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. రాహుల్ గాంధీ సందేశాన్ని మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై రూపొందించిన చార్జిషీట్‌ని ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.500 లకే గ్యాస్ సిలెండర్, ఒకేసారి రూ. 2లక్షల రుణమాఫీ, వైద్యం కోసం కుటుంబానికి రూ.5 లక్షలు, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దబోయిన దుర్గాప్రసాద్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి కొత్తా సీతారాములు, పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బెల్లం శ్రీనివాస్, స్టేట్ ఎస్సీ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ కొండూరు కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, అప్పారావు, ఎంపీటీసీ లక్ష్మణరావు, కృష్ణారెడ్డి, పెనుబల్లి, వేంసూరు, తల్లాడ మండల అధ్యక్షులు చెలికాని రాజబాబు, కాసర చంద్రశేఖర్, కాపా సుధాకర్, తోట జనార్దన్, గుండ్ల పుల్లారావు, పోతురాజు నరేంద్ర, చుక్కా తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

సత్తుపల్లిరూరల్: రానున్న ఎన్నికలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనని జిల్లా నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. సత్తుపల్లి మండలంలోని సిద్ధారం గ్రామంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, రాగమయిలు ఉపాధిహామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అప్పారావు, ధనంజయరావు, సుబ్బారెడ్డి, ఆదినారాయణ, కిట్టు, చెన్నారావు, గురువు, శ్రీను, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

జీలుగు విత్తనాలు పంపిణీ



ఎర్రుపాలెం: జీలుగు విత్తనాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ అక్కిరెడ్డి

మధిర/ఎర్రుపాలెం: రైతుల కోసం ప్రవేశపెడుతున్న జీలుగు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఎర్రుపాలెం సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, ఏఈఓ అర్చన అన్నారు. సోమవారం మధిర సొసైటీ కార్యాలయంలో, ఎర్రుపాలెంలోని పెద్దగోపవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో జీలుగు, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ సీఈఓ వీరారెడ్డి, వైస్ చైర్మన్ ఇజ్రాయేలు, సొసైటీ డైరెక్టర్లు శీలం పుల్లారెడ్డి, తల్లపురెడ్డి రామిరెడ్డి, బాణాల శ్రీనివాసరావు, సిబ్బంది ప్రసాద్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ‘ప్రజా గర్జన’ను విజయవంతం చేయండి

సత్తుపల్లిరూరల్: కొత్తగూడెంలో జూన్ 4న నిర్వహించే సీపీఐ ప్రజా గర్జనను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కాపాడుకోవడానికి, ఉపాధి కూలీలు కూలి రేట్లు పెంచుకోవడానికి, పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పన కోసం ఉపాధి కూలీలంతా జూన్ 4వ తేదీన కొత్తగూడెంలో జరిగే సీపీఐ ప్రజా గర్జన సభకు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ పిలుపు నిచ్చారు. సోమవారం సత్తుపల్లిలోని కొత్తూరులోని ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని, గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి సామన్యుల నడ్డి విరిసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు రామలక్ష్మి, నారాయణరావు, పాలకుర్తి వీరయ్య, వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, ప్రసాద్, ప్రసన్నరెడ్డి, సత్యవతి, సాంబయ్య, వెంకటమ్మ, రమణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కారేపల్లి: ఇటీవల గాలి దుమారానికి రేకుల ఇళ్లు కూలిపోవటంతో.. నిరాశ్రయురాలైన గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన వాంకుడోతు శాంతి కుటుంబానికి ఎంప్లాయిస్ ఫోరం ఫర్ గుంపెళ్లగూడెం పూర్‌పీపుల్స్ రూ.5 వేలు ఆర్థిక చేయూతను అందించారు. ఈ కార్యక్రమంలో ఫోరం సభ్యులు బి.వీరన్న, బి.వీరభద్రం, జి.శంకర్, బి.శివ, ఏ.వీరు, బి.వెంకటేష్, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం..

సత్తుపల్లిరూరల్: గంగారం మత్స్య సహకార సంఘం డైరెక్టర్ కొర్సా మహాలక్ష్మి ఇంట్లో పెళ్లి సందర్భంగా ఆ సంఘం సొసైటీ అధ్యక్షుడు కన్నారావు సోమవారం రూ.8 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో చలమారావు, మాజీ వార్డు సభ్యులు కోటేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మల్లేశ్వరరావు, రామచంద్రరావు, నర్సింహారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

కోతులను తరిమిన గ్రామస్తులు



కోతులను తరిమేందుకు కదిలిన గ్రామస్తులు

కారేపల్లి: మండలంలోని మాధారం గ్రామస్తులు కోతుల బెడద తట్టుకోలేక.. వినూత్న కార్యక్రమం చేపట్టారు. సోమవారం సర్పంచ్ అజ్మీర నరేష్, ఎంపీటీసీ సభ్యుడు భాగం రూపా నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వచ్ఛందంగా కదిలారు. గ్రామంలో ప్రతి వీధిలో తిరుగుతూ.. కోతులను కర్రలతో అదిరిస్తు సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తరిమారు. కార్యక్రమంలో మహిళలు సైతం కదలివచ్చారు. కోతులతో ఏగలేక పోతున్నామని, ప్రభుత్వం కోతుల బెడద నుంచి తప్పించేందుకు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

సదుపాయాలు కల్పించాలి



నిర్వాసితులకు హామీ ఇస్తున్న జీఎం రమేష్

సత్తుపల్లి: కొమ్మేపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ లబ్ధిదారులకు సదుపాయాలు కల్పించటంలో సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. సత్తుపల్లిలోని సింగరేణి క్వార్టర్స్‌ను పర్యవేక్షించి వస్తున్న జీఎం రమేష్ వాహనాన్ని సోమవారం మానవతారాయ్ ఆధ్వర్యంలో సింగరేణి నిర్వాసితులు అడ్డుకొని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కొమ్మేపల్లి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కాలనీలో నిర్మించాల్సిన చర్చి, మసీదు, రామాలయం, ఆర్వో వాటర్‌ప్లాంట్, ఉత్తరం వైపు ప్రహరీ, కమ్యూనిటీహాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. వీధిలైట్లు ఏర్పాటు, మంచినీటి సౌకర్యం తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. నిధులు మంజూరైనా 13 మందికి ప్యాకేజీ రాలేదని, పీఓ వెంకటాచారిని బదిలీ చేయాలని జీఎం రమేష్‌ను కోరారు. దీనిపై జీఎం రమేష్ మాట్లాడుతూ.. అన్ని సమస్యలను పరిష్కరిస్తామని, బ్యాంక్ అధికారులతో మాట్లాడి రుణాలు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఐ.కృష్ణ, కంభంపాటి కాంతారావు, ఏడుకొండలు, ప్రసాద్‌యాదవ్, రహీం, బాజీ, కలీల్, యూసూఫ్ పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మధిర: హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధిరలో సోమవారం హమాలీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో హమాలీలు 5 లక్షలకు పైగా పలు ప్రభుత్వ, ప్రైవేట్ గోడౌన్లు, మిల్లులు, మార్కెట్ యార్డుల్లో పనిచేస్తున్నారని తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన హమాలీలకు పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం నర్సింహారావు, మండల కన్వీనర్ మురళి, హమాలీలు జయ, నామాల శ్రీను, రెడపంగి ప్రసాద్, రాము, దుర్గయ్య, కృష్ణ, నాగమల్లేశ్వరరావు, నాగరాజు, మాధవరావు, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీకి తొత్తులుగా మారిన కమ్యూనిస్టులు

మధిర: కమ్యూనిస్టులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ విమర్శించారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. ప్రజల పక్షాన పోరాడాల్సిన కమ్యూనిస్టులు సీట్ల కోసం దిగజారి పోయి మాట్లాడుతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాల్లో బీజేపీ గెలుస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మధిర అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సాంబశివరావు, పట్టణ, మండల అధ్యక్షులు రమేష్, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

వైరారూరల్: పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న సంఘటన మండలంలోని కనకగిరి సిరిపురం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రదేశంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై శాఖమూరి వీరప్రసాద్ కథనం మేరకు.. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రదేశంలో కొంత మంది పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై ఆకస్మిక దాడులు నిర్వహించారు. 9 ద్విచక్రవాహనాలు, రూ. 6,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో ఆరుగురు పరారైనట్లు తెలిపారు. పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడులు నిర్వహించిన వారిలో ఎస్సై శాఖమూరి వీరప్రసాద్‌తో పాటు కోర్టు కానిస్టేబుల్ నర్సింహారావు, హోంగార్డ్ ముఖేష్ ఉన్నారు.

మేధా చారిటబుల్ ట్రస్ట్‌కు ఎంపిక

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి చెందిన జెడ్పీ పాఠశాల విద్యార్థిని గుమ్మడి రాజుల శ్రీలేఖ మేధా చారిటబుల్ ట్రస్టుకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఎంఈఓ బి.మురళీమోహన్‌రావు తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న ఈ విద్యార్థినికి మేధా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏడు సంవత్సరాలు ఉచిత విద్యను పొందడానికి అవకాశం దక్కినట్లు తెలిపారు. ఉత్తమ విద్యార్థిని శ్రీలేఖను ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్ మొగిలి అప్పారావు, ఎస్ఎంసీ చైర్మన్ పెరుగు నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న డాక్టర్ కోట రాంబాబు

మధిర: మధిరలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డాక్టర్ కోట రాంబాబు తెలిపారు. శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీనివాసరెడ్డికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక ఇటువంటి దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు. క్యాంపు కార్యాలయాన్ని ధ్వంసం చేసిన అనుమానితులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగిందన్నారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో కూడా శ్రీనివాసరెడ్డి అభిమాని చీకటి కార్తీక్ అను యువకుడిపై దాడి చేశారని తెలిపారు. ఇటువంటి ఘటనలు మరల పునరావృతం అయితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, యర్రగుంట రమేష్, చావలి రామరాజు, గోళ్ల ఉద్దండు, తాండ్ర తిరుమలరావు, గుండెమెడ బాలాజీ, అక్కినపల్లి నాగేశ్వరరావు, బాహాటం శ్రీనివాసరాజు, సోమ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ విద్యాలత

మధిర: తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత తెలిపారు. మండలంలోని మడుపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ గొప్ప ఆలోచనతో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ఓంకార్, పీహెచ్‌సీ వైద్యులు పృథ్వీ, సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కొత్తా జగన్నాథం, కాంగ్రెస్ నాయకులు

వైరా: వైరా మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొత్తా జగన్నాథం ప్రజల దాహార్తిని తీర్చడం కోసం వైరా శాంతినగర్‌లోని తన ఇంటి వద్ద వైరా ఖమ్మం ప్రధాన రహదారి పక్కన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, పాలేటి నరసింహారావు, పమ్మి అశోక్, పొదిల హరినాద్, గుగులోత్ రాము, కన్నెగంటి నగేష్, 15 వ వార్డు కౌన్సిలర్ గుడిపూడి సురేష్, నాగిరెడ్డి, అయూబ్ ఖాన్, వీరయ్య, రవి పాల్గొన్నారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్

ముదిగొండ: వీఓఏల సమస్యల పరిష్కారానికై వీఓఏలు చేపట్టిన చలో హైద్రాబాద్ కార్యక్రమానికి తరలివెళ్లకుండా మండలంలోని కందుల పద్మ, కుర్రి పద్మ, పరమేశ్వరి అనే ముగ్గురు వీఓఏలను ముదిగొండ పోలీసులు సోమవారం అరెస్టు అరెస్టు చేశారు.

గురుకుల ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

మధిర: తెలంగాణ గురుకుల పరీక్ష ఫలితాల్లో మండలంలోని సిరిపురం ఎస్సీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబర్చారు. పాఠశాల నుంచి గురుకుల ప్రవేశ పరీక్ష రాసిన 15 మంది విద్యార్థులు జిల్లాలోని పలు గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించారు. వీరిని మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్, గ్రామసర్పంచ్ పెద్ద బుచ్చయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైఎస్ఆర్ టీపీ బలోపేతానికి కృషి చేయాలి



కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తున్న రామునాయక్

కారేపల్లి: వైఎస్ఆర్ టీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ వైరా నియోజక వర్గ నాయకుడు బాధావత్ రామునాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గుడితండా, భాగ్యనగర్‌తండా, సామ్యతండా, లావుడ్యాతండా, పోలంపల్లి, అప్పాయిగూడెం గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించి.. పార్టీ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ఆర్ సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో కొనసాగాలంటే వైఎస్ఆర్‌టీపీ వ్యవస్థాపక అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నాయకత్వాన్ని బలపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌టీపీ జిల్లా మహిళా విభాగం నాయకురాలు గీతాబాయి, నాయకులు వీరన్న, ఎస్టీ సెల్ నాయకులు మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.